క్లుప్తంగా

త్యాగానికి ప్రతీక బక్రీద్

వైఎస్‌ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి (అన్నమయ్య సర్కిల్) : త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తోందని వైఎస్‌ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం స్ఫూర్తితో ప్రజలు సత్యం, న్యాయం, ధర్మం, త్యాగం, సహనం, పరోపకారం, బాధ్యతాభావం అలవరచుకోవాలని ఆయన కోరారు. దేవుడి దయతో ప్రజలందరూ ఆరోగ్యాలు, సుఖశాంతులతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలందరికీ అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లాలో ఎల్లప్పుడూ మత సామరస్యం వెల్లివిరియాలన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు శ్రీకాంత్‌రెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా రాజేష్



రాజంపేట టౌన్ : ఆర్యవైశ్య యువజన సంఘం రాజంపేటశాఖ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన బొగ్గరపు రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక అమ్మవారిశాలలో ఆదివారం నిర్వహించిన ఆర్యవైశ్య యువజన సంఘం ప్రతినిధుల సమావేశంలో రాజేష్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ పదవిలో ఆయన మూడేళ్లపాటు కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టడంతోపాటు మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. త్వరలో పూర్తిస్థాయిలో కమిటీ సభ్యులను నియమించనున్నట్లు రాజేష్ తెలిపారు.

నేడు ద్రౌపది కల్యాణోత్సవం

రామాపురం : మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మహాభారతి యజ్ఞంలో భాగంగా ఆదివారం ద్రౌపది మాత కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు మహాభారతం కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ద్రౌపది మాత తరఫున పలువురు దాతలు, పాండవుల తరఫున దాతలు పాల్గొని కల్యాణ నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. అందువలన మండలంలోని ప్రజలు పెద్ద ఎత్తున కల్యాణోత్సవానికి హాజరై కల్యాణ ఉత్సవాన్ని తిలకించాలని కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి రోజూ మాదిరే అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు.

జాంబవంతుడికి పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని అంకమ్మ నగర్‌లో వెలసివున్న జాంబవంతుడికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం నిర్వహించి స్వాములవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నల్ల గంగమ్మ ఆలయంలో విశేష పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న నల్లగంగమ్మ

సంబేపల్లి : మండల కేంద్రంలోని దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు విశేషపూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

పొట్టేళ్లకు భలే గిరాకీ



సంతలో విక్రయానికి సిద్ధంగా ఉన్న పొట్టేళ్లు

పీలేరు రూరల్ : బక్రీద్ పండుగ నేపథ్యంలో పొట్టేళ్లకు, మేకపోతులకు భలే గిరాకీ ఏర్పడింది. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డులో జరిగిన గొర్రెల సంతలో ధరలు ఆకాశాన్నంటాయి. మంచి రకం పొట్టేళ్లు, మేకపోతులకు డిమాండ్ ఏర్పడింది. బక్రీద్ కావడంతో పక్క రాష్ట్రం తమిళనాడు, కర్నాటక రాష్ట్ర నుంచి వ్యాపారులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పొట్టేళ్లు రూ. 20 వేల నుంచి రూ. 90 వేలు ధర పలికాయి. వ్యాపారులు, రైతులతో వారపు సంత కిటకిటలాడింది.

గోపాలవనంలో గోపూజలు

మదనపల్లి : బైపాస్‌రోడ్డు కొండామర్రిపల్లె చెరువుకు పడమర ఉన్నటువంటి గోపాలవనంలో సోమవారం ఉదయం గోపూజలు నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ వరదారెడ్డి నారదరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గోమాత పుట్టినరోజు పండుగ సందర్భంగా గో ప్రాశస్త్యం పదిమందికీ తెలపాలనే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

ప్రకృతి సోయగాలు..

పెరటి పూదోటలు



శామి ఫ్లవర్

పెరట్లో పూదోటలను పెంచడం ముగ్ధమనోహర అభిరుచికి అద్దం పడుతుంది. గృహాల ముంగిట, పెరట్లో కనిపించే రంగురంగుల పూల మొక్కలు సౌందర్యానుభూతిని సృష్టిస్తాయి. మొక్కలు ఉంటే ఆరోగ్యకరమైన గాలి పీల్చుకోవచ్చు. ఇళ్లలో పూలమొక్కలు పెంచుకునేందుకు ప్రతి ఒక్కరూ ఇష్టపడుతుంటారు. వరండాలో కొంచెం ఖాళీ స్థలం ఉన్నా అందులో మొక్కలు నాటాలన్న భావన వస్తుంది. ముఖ్యంగా మహిళలు ముందుగా పూలమొక్కలకు ప్రాధాన్యత ఇస్తుంటారు. ఇవి ఇంటికి అందం తేవడంతోపాటు అక్కడ నివసిస్తున్న వారికి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయి. రైల్వేకోడూరులో పలువురు పెంచుతున్న పెరటి పూదోటల పువ్వుల సోయగాలపై 'సాక్షి' ఫొటో ఫీచర్. – రైల్వేకోడూరు



పింక్ కలర్‌లో ఉన్న గడ్డిపూలు



గ్లాడియోలస్ రెడ్ ఫ్లవర్



లోబెడ్‌టిక్ ఫ్లవర్



జెర్బెరా ఫ్లవర్



ఇండియన్‌షాట్ ఫ్లవర్



గ్లాడియోలస్ ఎల్లో ఫ్లవర్

జిల్లా బాలుర సీనియర్ హాకీ జట్టు ఎంపిక

మదనపల్లె సిటీ: స్థానిక బీటీ కాలేజీలోని జినరాజదస హాకీ స్టేడియంలో ఆదివారం జిల్లా బాలుర సీనియర్ హాకీ జట్టు ఎంపిక చేశారు. అన్నమయ్య హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపికకు జిల్లా నలుమూలల నుంచి హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన జట్టు ఈనెల 27 నుంచి 31 వరకు ధర్మవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని హాకీ జిల్లా కార్యదర్శి శివ ప్రసాద్ తెలిపారు. ఎంపికైన వారి వివరాలు ప్రకటించారు. జి.రెడ్డి జయప్రకాష్, ఓ.రెడ్డిప్రసాద్, జె.రవితేజ, పి.రోహిత్, వి.సాయికిరణ్, పి.వెంకటసాయి, ఎస్.వెంకట్, కె.భానుప్రకాష్, బి.గంగాధర్‌రెడ్డి, బి.వెంకటనారాయణ, పి.సందీప్‌కుమార్ రాజు, కె.విశాల్‌వర్మ, కె.అశోక్, కె.బాబాఫకృద్దీన్, జి.నవీన్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో ది హాకీ అసోసియేషన్ అధ్యక్షులు ప్రసాద్, ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ పీడీ పి.ప్రసాద్‌రెడ్డి, నవీన్,హితేష్, భాస్కర, హరి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు

బి.కొత్తకోట: స్థానిక దారుల్ తౌహిద్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సభ్యులు బి.కొత్తకోట నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, పేదలు 90 మందికి దుస్తులను అందించారు. తౌహిద్ మసీదు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్ 60 మంది కార్మికులకు, 30 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను చేపట్టిన సంఘ సభ్యులను అతిథులు సత్కరించారు.

పండుగను సంతోషంగా జరుపుకోవాలి

వాల్మీకిపురం: ధనిక, పేద బేధం లేకుండా ప్రతి ఒక్కరూ బక్రీద్‌ను సంతోషంగా జరుపుకోవాలని ఆల్ మదద్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షులు నయీముద్దీన్ అన్నారు. ఆదివారం స్థానిక నాయక్‌వీధిలోని దర్గా ప్రాంగణంలో 175 మంది పేద ముస్లిం వితంతువులకు, పేదలకు బక్రీద్ తోఫా పంపిణీ చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

రాయచోటి టౌన్ : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ కొండూరు శ్రీనివాసరాజు రవాణా, యువజన, క్రీడల మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిని కోరారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఎస్‌ఎన్ కాలనీలో మంత్రి కార్యాలయంలో ఆయన్ను కలసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీపై సంతకం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వాటిలో ప్రధానంగా గతంలో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన విధంగానే రిటైర్మెంట్ రోజునే ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్ అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే 117 జీఓ రద్దు చేసి ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే విధంగా, మాతృభాషలోనే విద్యా బోధన చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విన్నవించారు. అలాగే ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బోధన కొనసాగించాలన్నారు. అలాగే ప్రతి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కంప్యూటర్ ఆపరేటర్లు ఉండే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయులు ఆరోగ్యంగా పథకం (ఈహెచ్‌ఎస్) అన్ని రకాల వ్యాధులకు అన్ని రకాల ఆస్పత్రులలో వర్తించే విధంగా చర్యలు చేట్టాలని విన్నవించుకున్నట్లు తెలిపారు. అలాగే ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్న ఏకీకృత విధానాలను అమలయ్యే విధంగా చూడాలని చెప్పారు. ఆయనను కలసిన వారిలో కేజీబీవీ ఉపాధ్యాయులు ఉన్నారు.



రాయచోటి: మంత్రి రాంప్రసాద్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

క్రీడలను ప్రోత్సహించండి

క్రీడలను ప్రోత్సహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించే విధంగా ప్రోత్సహించాలని అన్నమయ్య జిల్లా స్కూల్ గేమ్స్ సంఘం సభ్యులు క్రీడా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డిని కోరారు. ఆదివారం రాత్రి ఆయన కార్యాలయంలో అన్నమయ్య జిల్లా పీఈటీ సంఘం సభ్యులు మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయనను కలసిన వారిలో వసంత, వీరాంజనేయులు, లలితమ్మ, రెడ్డెయ్య, పీడీ దేవకమ్మ, చక్రపాణి, అంజి. వరదరాజు, కరుణాకర్, విశ్వనాథ, గురునాథ పాల్గొన్నారు.

దళిత సంక్షేమ పథకాలను పునరుద్ధరించండి

రాయచోటి అర్బన్ : దళితుల సంక్షేమానికి ఉద్దేశించిన సంక్షేమ పథకాలను ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని దళితహక్కుల పోరాట సమితి నేత మండెం సుధీర్‌కుమార్ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డికి విన్నవించారు. ఆదివారం పట్టణంలోని మంత్రి కార్యాలయంలో వారు ఆయనను కలుసుకుని మాట్లాడుతూ గతంలో దళితులకు 27 రకాల సంక్షేమ పథకాలు అమలవుతుండేవన్నారు. పథకాల అమలు వలన రాష్ట్రవ్యాప్తంగా అనేక దళిత కుటుంబాలు లబ్ధి పొందాయన్నారు. పథకాల రద్దు కారణంగా దళితుల అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వమైనా గతంలో అమలులో ఉన్న దళిత సంక్షేమ పథకాలను పునరుద్ధరించి దళితుల అభివృద్ధికి తోడ్పాటు నివ్వాలంటూ కోరారు. అనంతరం మంత్రికి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నేతలు ఎం.హరికుమార్, వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రాంప్రసాద్ రెడ్డిని కలిసిన ఎస్పీ

రాయచోటి : రాష్ట్ర రవాణ, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం మంత్రి నివాసంలో ఎస్పీ కృష్ణారావు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా శాంతిభద్రతలు తదితర అంశాలపై చర్చించారు.

మంత్రిని కలిసిన మండల వాసులు

చిన్నమండెం : రాయచోటి మండిపల్లి భవన్‌లో రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని పలువురు మండల వాసులు కలిశారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం పూలమాల వేసి దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతీకార చర్యలు ఆపి అభివృద్ధిపై దృష్టిపెట్టాలి



ఎంపీ మిథున్‌రెడ్డికి గజమాలవేసి ఘనస్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

రైల్వేకోడూరు : కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు తీసుకువచ్చి తనవంతు అభివృద్ధి చేస్తానని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డితో కలిసి నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని విధంగా ఐదు సంవత్సరాలలో అన్నమయ్య జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి సంక్షేమ పథకాలు అందించామన్నారు. ప్రజాతీర్పును గౌరవించి అధికార పార్టీలవారు అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలన్నారు. అధికారం శాశ్వతం కాదని ప్రతి ఒక్కరం ప్రజల పక్షాన నిలబడి వారికి సేవ చేయాలనే దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. ఎంపీగా అధికార పార్టీ ప్రతిపక్షాలు తేడా లేకుండా ప్రతి ఒక్కరికి సహాయం చేశామని చెప్పారు. ప్రజలకు అవన్నీ గుర్తుంటాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన విషయాలు గుర్తుంటాయని, తనను ఎంపీగా గెలిపించిన ఓటర్లుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే రైల్వేకోడూరులోని సర్పంచ్‌లు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి శాలువా కప్పి గజమాలతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ముద్దా బాబుల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, పంజం సుకుమార్‌రెడ్డి, సహదేవరెడ్డి, ముప్పాల హేమనవర్మ, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, సుధాకర్‌రాజు, వైఎస్ అన్వర్‌బాషా, సిద్దయ్య, సుబ్బరామరాజు, మండల నాగేంద్ర, సర్పంచ్‌లు చంద్రశేఖర్, హరిక్రిష్ణారెడ్డి, గోపి, శివయ్య, సుబ్రమణ్యంరాజులు, ఎంపీటీసీలు బండారు మల్లి, జనార్దన్‌రాజులు, మలిశెట్టి వెంకటరమణ, రౌఫ్, కరీముల్లా, ఆర్‌వి.రమణ, రాజారెడ్డి, క్రిష్ణారెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, దమ్ము రఘు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ ఎస్‌కేఆర్ నగర్ ఎస్సీ కాలనీలో వెలసిన అంకాలమ్మ తిరునాల సందర్భంగా ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీలను సీనియర్ వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు ఉపాసి వెంకటరమణారెడ్డి, స్థానిక మాజీ సర్పంచ్ మేకపాటి సుబ్బారెడ్డిలు ప్రారంభించారు. ఈ పోటీల్లో ఆరు జతల ఎడ్లు పాల్గొన్నాయి. మెదటి బహుమతి దాత మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మేడా మధుసూదన్‌రెడ్డిలు రూ. 70 వేలను నంద్యాల జిల్లాకు చెందిన కె. రాంభూపాల్‌రెడ్డి ఎడ్లు గెలుచుకున్నాయి. రెండవ బహుమతి దాత జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, మాధవరం-1 మాజీ సర్పంచ్ మేకపాటి సుబ్బారెడ్డి రూ. 50వేలను అనంతపురం జిల్లా, గార్లదిన్నె గ్రామానికి చెందిన కె.రమేష్ ఎడ్లు గెలుచుకున్నాయి. మూడవ బహుమతి దాత వైఎస్‌ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు ఉపాసి వెంకటరమణారెడ్డి, సిద్దవటం జెడ్పీటీసీ సభ్యుడు ఉపాసి శ్రీకాంత్‌రెడ్డిలు రూ. 30 వేలును వైఎస్‌ఆర్ జిల్లా వల్లూరు మండలం బాలిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఇందిరెడ్డి రమణారెడ్డి ఎడ్లు గెలుచుకున్నాయి. నాల్గవ బహుమతి దాతలు స్థానిక ఎస్‌కేఆర్ నగర్ వాసులురూ.10,000ను అనంతపురం జిల్లాకు చెందిన తిరుపాల్‌రెడ్డి ఎడ్లు గెలుచుకున్నాయి. ఈ బహుమతులను ఆలయం పెద్దల సమక్షంలో ఎడ్ల యజమానులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాధవరం-2 ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మిరెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు వావిళ్ల శ్రీనివాసులరెడ్డి, జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, అరవ నారాయణరెడ్డి, వెంకట్, గంగన్న, బండి నాగమునిరెడ్డి, మాజీ సర్పంచ్ గాలి ఓబులయ్య, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభించిన వైఎస్‌ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు ఉపాసి వెంకటరమణారెడ్డి

ప్రారంభమైన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



ఆలయాన్ని సుందరంగా అలంకరించిన దృశ్యం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండల కేంద్రమైన పెనగలూరులో వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం వేడుకగా ప్రారంభమయ్యాయి. అంకుకార్పణతో వర్తక సంఘం వారు ఉభయదాతలుగా ఈ బ్రహ్మోత్సవాలను ప్రారంభించినట్లు ఆలయ చైర్మన్ సుబ్బయ్య, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్యలు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. కాగా నూతనంగా ఆలయ చైర్మన్‌గా జిలకల సుబ్బయ్య సోమవారం రాత్రి 9 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నట్లు గ్రామ పురోహితుడు తెలియజేశారు.

అంగరంగ వైభవంగా అమ్మవారి జాతరలు



సంబేపల్లి: మాతమ్మ జాతరకు తరలివచ్చిన భక్తులు



చిట్వేలి: తిరునాలలో పాల్గొన్న భక్తులు

చిట్వేలి : మండల కేంద్రమైన చిట్వేలి సత్యం వీధిలో వెలసిన సత్యమ్మ తల్లి తిరునాల మహోత్సవాన్ని నిర్వాహకులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శనివారం ప్రత్యేక పూజలు, పోతుల రాజు గ్రామోత్సవంతో ఆసాదు వారిచే అమ్మవారికి కథను చదివించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రెండోరోజు ఆదివారం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పొంగళ్లు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి బలిదానాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం చౌడవరం కీ.శేలు రంగారెడ్డి కుటుంబ సభ్యులు ఉత్సవం సందర్భంగా ఆర్కెస్ట్రా ఏర్పాటు చేశారు. తిరునాల ఆఖరిరోజు సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం మధ్యాహ్నం చౌడవరం రఘురామిరెడ్డి కుటుంబ సభ్యులు భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మారమ్మకు పొంగళ్లు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన శ్రీ మారమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి పొంగళ్ల మహోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం మహిళలు పెద్ద ఎత్తున పొంగళ్లను అమ్మవారికి సమర్పించారు. మహోత్సవంలో పాల్గొన్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ధర్మకర్తలు శింగమాల సుబ్బరామిరెడ్డి, దుర్గా ప్రసాద్‌రెడ్డి, ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శాలువా పూలమాలతో సత్కరించారు. మహిళలు తెల్లవారుజాము నుంచే ఆలయ ఆవరణలో పొంగళ్లను తయారు చేసి అమ్మవారికి సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు అన్నం నాగేంద్ర, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు తుమ్మల శ్రీధర్‌గౌడ్, అక్కిరెడ్డి మోహన్‌రెడ్డి, సోమిశెట్టి ప్రభాకర్, అరిగే నాని, ఓట్స్ శ్రీనివాసులు, పెనుబాల నాగసుబ్బయ్య, కాకి చంద్ర, గుండు గోపాల్‌రెడ్డి, ఆకేపాటి రమేష్‌రెడ్డి, స్వామి, ఏలుమలై, వాణి తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : మండల పరిధిలోని ప్రకాస్‌నగర్ కాలనీ సమీపంలో కొలువైన మాతమ్మ జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శనివారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు గావించారు. భక్తులు బోనాలు సమర్పించారు. రాత్రి మొక్కుబడులు కలిగిన భక్తులు చాందినీబండ్లను ఆలయం చుట్టూ తిప్పారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని ఎస్‌ఐ రామకృష్ణ గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఘనంగా నాగారపమ్మ తిరునాల

సుండుపల్లె : నాగారపమ్మ తిరునాల మహోత్సవం ఘనంగా సాగుతోంది. ఈ మహోత్సవానికి పక్క జిల్లాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని పూజించుకున్నారు. తిరునాలలో భాగంగా సోమవారం ఉదయాన్నే పూజారులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. రాయచోటి డిపో నుంచి తిరునాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు.



నందలూరు: మారమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి



చిట్వేలి: ప్రత్యేక పూజలందుకున్న సత్యమ్మ తల్లి